నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం - 62



జీవితంలో ప్రతి సంఘటనా ఓ కథే!!

- కె. వరలక్ష్మి

వెనకబడిన కులంలో జన్మించినా సాహిత్యంలో వెనకబడని వ్యక్తి కె.వరలక్ష్మి. జగ్గంపేటను కేంద్రంగా చేసుకుని ఎక్కువ కథలు రాశారు. కథలన్నిటా అట్టడుగు స్త్రీల జీవితాల్లోని సుఖ దుఃఖాలుంటాయి. మనల్ని వారి పట్ల సహానుభూతికి గురి చేస్తాయి. సుమారు **120** కథలు రాసి, కథా సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపు పొందిన కె.వరలక్ష్మి గారితో ఇంటర్వ్యూ ఈవారం..

చదువుకోవడం ఓ సాహస కార్యం

సాహిత్య ప్రక్రియల్లో అన్నిటికన్నా నాకిష్టమైనది కథ. ఈ కథమీది అమితమైన ఇష్టమే నన్ను రచయితను చేసిందనుకుంటాను. రచనలు చేయక ముందు నేను ఉత్త పిరికిదాన్ని. రచనలు నా జీవితానికొక అర్థాన్ని, పరమార్థాన్ని, ధైర్యాన్ని ఇచ్చాయి. నాలోని ఇన్ఫీరియారిటీని దూరం చేసాయి. సాహిత్య ప్రపంచాన్ని నాకు పరిచయం చేసిన చదువుకి ముందుగా కృతజ్ఞతలు చెప్పుకొంటాను. ఎందుకంటే నా బాల్యం నాటి రోజుల్లో మా వెనకబడిన కులంలో బడికెళ్లడం, చదువుకోవడం ఒక పెద్ద సాహస కార్యం. నా జన్మస్థలం, ప్రస్తుత నివాసం తూర్పు గోదావరి జిల్లాలోని జగ్గంపేట. బంగారమ్మ, పల్లా వెంకటరమణ మా తల్లిదండ్రులు.

చదవలేక బావురుమని ఏడ్చేసాను

ఊహ తెలిసినప్పటినుంచి నాకు కథల మీద ఉన్న ఆసక్తే నన్ను చదువు వెంట పరుగులెత్తించింది. బాల్యంలో మా నానమ్మ నాకు తరచుగా కృష్ణుడి బాల్య క్రీడల్ని వర్ణించి వర్ణించి కథలుగా చెప్తూ ఉండేది. అప్పట్లో బాలనాగమ్మ కథ వినడం నాకెంతో ఇష్టం. పుస్తకాల్లో కథలుంటాయని ఎలాగో తెలి

కుటుంబ సభ్యులతో...

సింది. కథల మీది ఇష్టంతో ఎప్పుడెప్పుడు బడికెళ్లి చదువుకుందామా, పుస్తకాలన్నీ చదివేద్దామా అని ఉండేది. స్కూల్లో టీచర్ అప్పుడప్పుడు నన్ను వొళ్లో కూర్చోబెట్టుకుని ముద్దు చేసేది. అందుకని బడికెళ్లడం నాకు మరీ ఇష్టంగా ఉండేది. మా అమ్మాయి బడికెళ్తుందని మా అమ్మ గొప్పగా అందరితో చెప్పడం వలన మా వీధిలో ఎవరికి ఉత్తరం వచ్చినా నన్ను చదవమని పట్టుకొచ్చేవారు. అలా ఒకటో తరగతిలోనే నేను కూడబలుక్కుని వాక్యాలు చదవాల్సిన అవసరం ఏర్పడింది. అదే రోజుల్లో మా వీధిలో ఆడవాళ్లంతా కల్సి నాకొక అగ్నిపరీక్ష పెట్టేరు. శ్రీలక్ష్మమ్మ కథ– ద్విపద పుస్తకం మా ఊరి సంతలోంచి తెచ్చి, మధ్యాహ్నం బడినుంచి ఇంటికొచ్చిన నన్ను ఆ పుస్తకం చదివి విన్పించమని మా అరుగుల నిండా వచ్చి కూర్చున్నారు. నేను 'చదవలేను' అని చెప్పగానే వాళ్లంతా నవ్వులు మొదలెట్టేరు 'బడికెల్తున్నావు పుస్తకం సదవలేవా' అని. నేను బావురుమని ఏడ్చేసాను. కాని, చాలా అవమానం అన్పించి నాలో పట్టుదల పెరిగింది. రాత్రుళ్లు మా నాన్ననడిగి పదాలన్నీ గుర్తు పెట్టుకుని త్వరలోనే ఆ పుస్తకాన్ని వాళ్లకి చదివి విన్పించేను. అది మొదలు, సంతలోని ద్విపద పుస్తకాలు, పాటల పుస్తకాలు మా ఇంటికి చేరుకొనేవి. అలా వాళ్ల వలన నాకు తొందరగా చదవడం వచ్చింది.

నాకోసం 'చందమామ' తెచ్చేవారు

స్కూల్లో మా హెడ్మాస్టారి కుర్చీ వెనక ఒక చిన్న గది ఉండేది. దానికెప్పుడూ ఓ తాళం కప్ప వేళ్లాడుతూ ఉండేది. హెడ్మాస్టారు మా ఇంటి పక్కనే అద్దింట్లో ఉండేవారు. రెండో తరగతి చదివేటప్పుడు హెడ్మాస్టారమ్మాయి సుల్తానా బేగం, నేనూ ఒకే బెంచీ మీద కూర్చునే వాళ్లం. ఓసారి తను చెప్పింది ఆ గది నిండా పుస్తకాలున్నాయని. నేను లీజర్ టైమంతా ఆ పుస్తకాల్తో కూర్చునేదాన్ని. బొమ్మల రామాయణం, సింద్‌బాద్‌లాంటి కథలన్నీ నేను ఆ గదిలోనే చదివేను. నా కథల పిచ్చి చూసి మా నాన్న అప్పుడప్పుడు నాకోసం చందమామ పుస్తకాలు కొని తెచ్చేవారు. నా అదృష్టం కొద్దీ మా వూరికి అప్పుడే లైబ్రరీ వచ్చింది. మా వీధిలోనే ఓ గది, దాని అరుగు లైబ్రరీ అయ్యాయి. ఆ రోజుల్లో స్కూలు చదువులింతంత బరువులు లేవు. ఇంట్లో స్కూలు పుస్తకాలే చదవమని గద్దించే వాళ్లెవరూ ఉండేవారు కాదు. ఇక బడి నించి వచ్చి, పుస్తకాల సంచి విసిరేసి, లైబ్రరీకెళ్లిపోవడం. ఆడపిల్లలెవరూ రాని లైబ్రరీకి నేను వెళుతున్నందుకు ముచ్చటపడి లైబ్రేరియన్ పిల్లల కథల పుస్తకాల్ని పైన పెట్టి ఉంచేవాడు. ఇంట్లో చదువుకుందుకు కూడా ఇచ్చేవాడు.

జిల్లాలో మొదటి బహుమతి వచ్చింది

మూడో తరగతి చదివేటప్పుడు నేను, నా ఫ్రెండు మీనాక్షి మా వూరి మహిళామండలిలో ప్రార్థన గీతం పాడడానికి వెళ్లేం. మహిళామండలిలో అంతా కలిసి పదిమంది కూడా లేరు. కాని, రెండు బీరువాలనిండా పుస్తకాలు మాత్రం ఉన్నాయి. వాటిని ఎప్పుడూ, ఎవరూ కదిల్చిన దాఖలాలు లేవు. శరత్‌వీ, రవీంద్రుడివీ అనువాదాలు కూడా అందులో ఉన్నాయి. ఫంక్షనయ్యేవరకూ ఆగి, ఆ ఇంటివాళ్లనెలాగో బతిమాలుకుని ఓ పుస్తకం ఇంటికి తెచ్చుకున్నాను. మా అమ్మకి కథలు వినడం అంటే ఎంతో ఇష్టం. ఆవిడేం చదువుకోలేదు. ఇంటిపని చేసుకునే మా అమ్మకి వెంటవెంట తిరిగి విన్పిస్తూ అలా ఆ పుస్తకాలన్నీ చదివేను.

నేను నాలుగో తరగతి చదివేటప్పుడు ఊళ్లో ప్రధాని నెహ్రూ పుట్టినరోజు ఘనంగా జరిపేరు. అన్ని స్కూల్స్‌కీ కలిపి నెహ్రూ గురించి వ్యాసరచన పోటీ పెట్టేరు. నేను రాసిన వ్యాసానికి జిల్లాలో మొదటి బహుమతి వచ్చింది. మా వూరి హైస్కూలు స్టేజిపైన డి.ఇ.వో. గారి పక్కనే ఓ కుర్చీలో నన్ను కూర్చోబెట్టి ఘనంగా సన్మానించేరు. ఆ చిన్న వయసులో ఆ సంఘటన నన్ను చాలా ఎంకరేజ్ చేసింది. ఇక బుల్లి బుల్లి వ్యాసాలు రాయడం మొదలెట్టేను.

నాటకాల్లో వేషాలేశాను

మా నాన్నతో కలిసి ఎన్నో సురభి నాటకాలు చూసేను. మా ఆన్న వాళ్లూ గ్రామంలో ఉత్సవాలకి వేసే పౌరాణిక నాటకాల్లో చిన్నికృష్ణుడు, లోహితాస్యుడు, నారదుడు లాంటి కేరెక్టర్స్ పదేళ్ల వయసొచ్చే వరకూ చేసాను. మా మేనమామల్లో ఒకాయన మా ఇంట్లోనే ఉండేవాడు. రాత్రి మాతో బాటు వీధిలో పిల్లలందర్నీ చుట్టూ చేర్చుకుని కల్పిత కథలేవో చెప్తూ ఉండేవాడు. అవికాక పడమటి నుంచి మందులు అమ్మడానికి వచ్చేవాళ్లు పగలంతా చుట్టుపక్కల ఊళ్లు తిరిగి వచ్చి, రాత్రి మా ఇంటి వెనక ఖాళీ స్థలంలో వండుకు తిని, అర్ధరాత్రి దాటే వరకూ పెద్ద గొంతుతో పల్నాటి యుద్ధం, కాటమరాజు లాంటి కథల్ని చెప్తూ ఉండేవారు. ఇంకా పంబల కథలు, తప్పెటగుళ్లు, హరికథలు, బుర్రకథలు అన్నిటికీ అటెండైపోయేదాన్ని.

పెళ్లితో సాహిత్య వ్యాసంగం కొండెక్కింది

ఆరో, ఏడో చదువుతూండగా నాకు రవీంద్రుడి గీతాంజలి తెలుగు అను

వాదం దొరికింది. గీతాంజలి నాకెంతగా నచ్చిందంటే తెల్ల కాయితాల సన్నని పుస్తకం కుట్టుకుని గీతాంజలిని యథాతథంగా చిన్నచిన్న గుండ్రటి అక్షరాల్లో మొత్తం రాసుకున్నాను. అప్పట్నుంచీ నాకు కవిత్వం రాయాలనే ఆకాంక్ష మొదలైంది. అదే సమయంలో మా ఊరి లైబ్రరీకి ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభ, యువ, జ్యోతి లాంటి పత్రికలు రావడం మొదలైంది. కొన్ని బాలగేయాలు పత్రికలకు పంపించేను. అవి ప్రచురణలో చూసుకుని తెగ మురిసిపోయేను.

నేను 8వ క్లాసు చదివేటప్పుడు ఆంధ్రపత్రిక పోటీలో కథ కాని కథ శీర్షికలో నా మొదటి కథ ప్రచురితమైంది. ఆ కథ పేరు 'కాఫీ కాదు'. ఆ పత్రిక వినాయకచవితి ప్రత్యేక సంచిక. నేను స్కూల్లో ఉండగా పోస్ట్‌మేన్ మా క్లాసుకొచ్చి పత్రికతో పాటు ఏడున్నర రూపాయల బహుమతి సొమ్ము ఇచ్చి వెళ్లేడు. ఇక అంతే! మా హెడ్మాస్టరుతో సహా టీచర్లంతా చదివి మెచ్చుకున్నారు. స్కూలు వార్షికోత్సవంలో స్టేజి మీద నా కథ విషయం ప్రస్తావించి నన్ను రచయిత్రిని చేసేసారు. అదే ఉత్సాహంతో నా నోట్‌బుక్‌లో పదిపేజీల కథ ఒకటి రాసేసాను. పదో తరగతిలో జరిగిన నా పెళ్లి తర్వాత బతుకుతెరువు పాట్లలో మొత్తం నా సాహిత్య వ్యాసంగం కొండెక్కింది. రెండుమూడు కథలు రాసినా అవీ బైటికి రాలేదు. అలా ఓ బుల్లి రచయిత్రి పల్లా వరలక్ష్మీకుమారి మరుగున పడిపోయింది.

ఎంతో స్ట్రగుల్ ఫేస్ చేసాను

తిండికీ, బట్టకీ లోటు లేకుండా ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కొంత సమయం పట్టింది. ఈ లోపల హిందీ పరీక్షలు, ఇంటర్ నుంచి ఎమ్.ఏ. వరకూ చదువుతో బాటు అందుబాటులోకి వచ్చిందల్లా చదివేను. ఆ క్రమంలో మహామహుల రచనలెన్నో చదవడం జరిగింది. టీచింగ్ మీద ఇష్టంతో కొంతకాలం ఓ స్కూలు నడిపేను. స్కూలు పిల్లల తల్లుల ద్వారా, మా టీచర్స్ ద్వారా ఎన్నెన్నో జీవితాల గురించి విన్నాను. నేను స్వయంగా ఎంతో స్ట్రగుల్ ఫేస్ చేసాను. పల్లెలో నా చుట్టూ ఉన్న స్త్రీల జీవితాలనెన్నిటినో పరిశీలించేను. వెనకబడిన తరగతుల స్త్రీలు కుటుంబ హింసతోబాటు సామాజిక హింసకూడా అధికంగా ఓర్చుకోవాల్సి వస్తోందని క్రమంగా నాకు అర్థమైంది. అసలది హింస అనీ, దాన్నెదుర్కోవాల్సిన అవసరం ఉందనే స్పృహే వాళ్లకి ఉండడం లేదు. ఇలాంటి నేపథ్యంలో తిరిగి 1985లో నాకథారచన సక్రమంగా ప్రారంభమైంది.

అలాంటి కథ మళ్లీ రాయలేదు

జ్యోతి మంత్లీలో వచ్చిన నా 'రిక్షా' కథలో, మా స్కూలు కోసం నేను కొన్న రిక్షాని నడిపే రిక్షావాల నన్ను ఎన్ని పాట్లు పెట్టేడో రాసేను. కాని, ఆర్థికంగా వెనకబడిన వాళ్లు చేసే ఎక్స్‌ప్లాయిటేషన్‌కి కారణాలు, మూలాలు ఏమిటో అర్థమయ్యాక నేను మళ్లీ అలాంటి కథ రాయలేదు. మొదట్లో నన్ను పాలగుమ్మి పద్మరాజు గారి కథలు ఎంతో ఆకట్టుకున్నాయి. కథలో కల్పన లేదు, అంతా ఇలానే జరిగి ఉంటుంది అన్పించేది. నాకు కూడా అలాగే రాయాలన్పించేది. సజీవమైన సంఘటన నన్ను పట్టి కుదిపేసినప్పుడు దాన్ని కథగా రాయకుండా ఉండలేను. ఇప్పటికి వివిధ పత్రికల్లో 120కి పైగా కథలు, నాలుగు నవలికలు, కవితలు, వ్యాసాలు ప్రచురించబడ్డాయి. మావారు కె.రామమోహనావు గారు ఈ మధ్యనే కాలం చేసారు. మాకు అబ్బాయి రవీంద్ర, అమ్మాయిలు గీత, లలిత. మా అమ్మాయి కె.గీత కూడా కవయిత్రి.

ఆ తిరుగుబాటు తాత్కాలికమే!

పల్లెల్లో జరుగుతున్న అన్యాయాల్ని ఎత్తి చూపాలన్నదే నా ముఖ్యోద్దేశం. సాధారణంగా నా కథల్లో ముఖ్యపాత్ర స్త్రీ అయి ఉంటుంది. స్త్రీలు ఎంతటి అణచివేతకి గురవుతున్నారో, దౌష్ట్యానికి బలైన స్త్రీలు ఎందుకు తిరగబడలేక పోతున్నారో కథల్లో చెప్పడానికి ప్రయత్నించేను. తిరగబడే వాళ్లని నేనెంతో లైక్ చేస్తాను. కాని పల్లెల్లో ఆ తిరుగుబాటు కూడా తాత్కాలికమేనని, తర్వాత అదీ అణచివేయబడుతుందనీ గ్రహించడానికి ఎంతో సమయం పట్టలేదు.

ఆ అయిదు రూపాయిలు పంపించండి

నా కథలు చాలావరకు మా జగ్గంపేటనూ, మా ప్రాంతాన్ని ప్రతిబింబిస్తాయి. 'గోదావరి జిల్లాల్లో సమస్యలుండవు' అనేమాట నిజం కాదు. ఇదంతా మెట్టప్రాంతం. వర్షాధార భూములు కావడం వలన బోలెడన్ని జీవన సమస్యలు. ఈ జగ్గంపేట ఊరు ఇప్పుడు పెరిగి పెద్దదై మండలానికి కేంద్రమై చాలా మారిపోయింది కాని 'రాజశేఖర చరిత్రం'లో ప్రస్తావించబడిన ప్రాచీనమైన పల్లె ఇది. ఇక్కడి మన్యం ప్రాంతంలో ఒక సంప్రదాయం ఉండేది. బంధువుల్ని పలకరించడానికి వెళ్లేవాళ్లు సంచిలో బియ్యం, చంకలో కోడిని పట్టుకొని వెళ్లేవాళ్లు. ముందుగా కబురు తెలిపే అవకాశం లేదు కాబట్టి వీళ్లు వెళ్లగానే అవతలి వాళ్లు ఇబ్బంది పడకూడదని అలా చేసేవారు.


కాళీపట్నం రామారావు, చాగంటి తులసి తదితరులతో...

ఒకసారి మా నాన్నకి ఒక ఉత్తరం వచ్చింది. 'మేం మీ అమ్మాయి పెళ్లికొచ్చి 5 రూపాయిలు చదివించేం. ఈ మధ్య మా ఇంట్లో జరిగిన పెళ్లికి మీరు రాలేదు. కాబట్టి ఆ అయిదు రూపాయిలు పంపించండి' అని. సరిగ్గా ఆలోచిస్తే ఈ సంఘటనల వెనక ఆర్థికపరమైన వెనుకబాటుతనం కన్పిస్తుంది. అవే భిన్నమైన కథా వస్తువులు.

పరిధులు విధించుకోవడమే!

జీవితాన్ని ఏదో ఒక ఇజానికి సంబంధించిన పరిధిలోంచి చూడడం రచయిత తనకి తాను పరిధులు విధించుకోవడమేనని నేననుకుంటాను. కథని బట్టి పాత్రలకి సహజంగా నడచుకునే స్వేచ్ఛనివ్వాలి. నిరంతర చైతన్యవంతమైన మనిషి జీవితంలో ప్రతి సంఘటనా ఒక కథావస్తువే. ఆర్థిక, సాంఘిక అసమానతల్ని, వాటి మూలాల్ని, గ్లోబలైజేషన్ ప్రవాహంలో అన్నీ కొట్టుకుపోయేలా రాజకీయం చేస్తున్న ప్రభుత్వాల విధానాల్ని పరిశీలించి రాయడం రచయితల బాధ్యత.

–మోహన్‌రాగ్

నాకు నచ్చిన నా కథ

గాజుపళ్ళెం

"రెండు బుల్లి చేతులు వింటిని ఎక్కుపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయి ఎప్పట్నుంచో. హమ్మయ్య! ఆ చేతుల ప్రయత్నం ఫలించింది. బాణాన్ని వింటికి సంధించి..లాగి.. లాగి.. వదిలేసాయ్, అబ్బా..!"

మూడంకె వేసి ముణగదీసుకు పడుకున్న గంగ కడుపులోని బిడ్డ కదలికకి ఉలిక్కిపడి కలలోంచి మెలకువలోకొచ్చింది. సూదుల్లా గుచ్చుతున్న కంకరగుట్ట మీద భారంగా వెల్లకిలా తిరిగింది. ఎర్రని అగ్నిపూల గుత్తుల మధ్య నుంచి ఎండ నిప్పుకణికల్లా కళ్ళల్లోకి దూకింది. చటుక్కున మోచేతిని కళ్ళమీద కప్పుకుంది. ఏదో అనుమానం వచ్చి మోచెయ్యి సందు నుంచి స్టేషను గేటువైపు చూసింది. గేటు కవతల ఫెన్సింగు కానుకుని పోర్టరు గన్నిగాడు బీడీ తాగుతూ ఆకలి కళ్లతో గంగని తినేసేలా చూస్తున్నాడు.

'చీ ఎదవా' అని తిట్టుకుని అటు తిరిగి పోయింది గంగ. ఆమెకి వాడి చూపులేం కొత్తకాదు. 'ఎప్పుడూ అదే యావ ఎదవ సచ్చినోడికి' అనుకుంది. ఒకట్రెండుసార్లు ప్రయత్నించి ఆమె చేత తలమొయ్యో చివాట్లు తిని కేవలం చూపుల్తోనే తృప్తి పడుతున్నాడు ప్రస్తుతం గన్నిగాడు.

పొద్దుట్నించి టీ నీళ్లైనా పడని ఖాళీ కడుపులో బిడ్డ ఆకలికి కాబోలు లుంగులు తిరుగుతోంది. చీర పొత్తిళ్లలో చేయి దూర్చి పొత్తి కడుపునోసారి తడుముకుంది గంగ. చేతి మీద చాచి తన్నిన బిడ్డ కాలుని అందుకోవాలని విఫల ప్రయత్నం చేసింది. కొంత సేపు ఇటు పట్టుకోబోతే అటు, అటు పట్టుకోబోతే ఇటు కదులుతున్న బిడ్డతో ఆడింది.

కొంత సేపటికి విసుగొచ్చి ఆట మానేసింది.

సన్నని మంటలాగా ఆకలి మొదలయింది కడుపులో. లేవడానిక్కూడా ఓపిక లేనంత నిస్సత్తువగా ఉంది. ఆకల్తోబాటు గంగని పశ్చాత్తాపం కూడా కొంచెం కొంచెంగా తినడానికి సిద్ధమైంది.

అసలా బోడిదాన్తో తగువు పడకుండా ఉండాల్సింది. వాగి వాగి దాని నోరే నెప్పెట్టి రెండు చేతులా మూసుకునేది. తగువుపడి మాత్రం తనుసాధిం చిందేం ఉంది? చెయ్యి వెనక్కి చాచి తలకిందున్న గుడ్డల మూట మధ్యలో పదిలంగా పాతకోకలు చుట్టిపెట్టిన గాజుపళ్లాన్నోసారి తడిమి చూసుకుంది.

ఆ బోడిది విసిరిన విసురుకి గాజుపళ్లెం భళ్లుమనేదే, సమయానికి సరిగ్గా తను పట్టుకునుండకపోతే. అప్పటికీ అంచుమీద చిన్న పెచ్చూడిపోయింది. తన ప్రాణం గిలగిలా కొట్టుకుంది. అసలా బోడిదానికి తనని ఆళ్ల కూడా తీసుకెళ్లడం ఇష్టం లేకే ఇంత నాటకమాడింది.

నెమ్మదిగా లేచి చెట్టుకు చేరబడి కూర్చుంది గంగ. ఒళ్లంతా పచ్చి ముద్ద లాగుంది. చేతులు ముందుకు చాపి చూసుకుంది. అది గోళ్లతో గీరిన చారలు రక్తాలు పేరుకు పోయినై. దుబ్బులాగున్న తన జుట్టుని చేతికి చుట్టుకని వంగదీసి వీపు మీద గుద్దిన గుద్దులకి తన ప్రాణం కడెక్కిపోయినట్టైంది. రోగిష్టిదాన్లా ఎప్పుడూ మూలుగుతూ వుండే బోడిదాని చేతుల్లో అంత బలం ఎక్కణ్ణుంచొచ్చిందో!

పొద్దున్నే జరిగిన గొడవ గుర్తుకొచ్చిన గంగకి ఏడుపొచ్చింది. బోడమ్మ నలుగురు పిల్లల్నీ అటిద్దర్నీ ఇటిద్దర్నీ వేసుకుని గాఢ నిద్దట్లో ఉన్న గంగ చెవులు హోరెత్తి పోయే కేకలు ఏడుపుల మధ్య తుళ్ళిపడి లేచి కూర్చుంది. తూర్పింకా తెల్లబడలేదు. గోదావరి స్టేషన్లోకి ఏదోబండొచ్చి ఆగినట్టుంది, స్టేషనంతా సందడిగా ఉంది. గుడిసెల్లోని జనం అటూ ఇటూ పరుగులెడుతూ గిన్నెలూ, తపేలాలూ మూటలు కట్టుకుంటున్నారు. గుడ్డి సూరయ్య తాత తడుంకుని పొయ్యిలో సగం కాలి ఆరిన కట్టెపుల్లన్ని కాలకుండా మిగిలిన రెండు పుల్లల్తోనూ కలిపి కడుతున్నాడు. అటుపక్క స్టేషన్లోంచీ, ఇటు పక్క కళాకేంద్రం ఆవరణలోంచీ లైట్లు పట్టపగల్లా వెలుతుర్ని కురిపిస్తున్నాయి. బండి దిగిన జనం బద్ధకంగా స్టేషన్లోంచి బైటికొస్తున్నారు.

ఏం జరుగుతోందో కొంత సేపటి వరకూ గంగకి అర్థం కాలేదు.

గుడిసెలపైన ఆచ్ఛాదనగా వేసుకున్న ఆకుల్నీ, గోనె పట్టాల్నీ ఆదరా బాదరా విప్పి పోగులు పెట్టుకుంటున్నారు కొందరు. కుండల్నీ, గిన్నెల్నీ గోనె సంచుల్లో వేసి మూటలు కడుతున్నారు మరికొందరు.

''ఏయే, గుడిసె... నం..! కళ్లం పడతాలేదేటి? రాజాగోరల్లే తొంగున్నావ్. నెగు నెగు. నెగిసి గుడ్డా గుడుసూ అన్నీ మూటలు గట్టు. తెల్లారిందంటే మున్సిపాల్టీ మొగుళ్లొచ్చేతారు. ఇయ్ కూడా దక్క కుండా తరివేత్తారు'' బోడమ్మ గుడిసెలో పడుకునే అరుస్తోంది.

గంగ చివుక్కున లేచి నిలబడింది. ఆ ఊపుకి ఎడం మక్కె పట్టే సినట్టయింది. అసలే నిద్ర చాలని బద్ధకం. ఒళ్లు మండుకు పోయింది గంగకి.

''గుడిసెలోంచి కాళ్లు సగం బైటికి సాపి గుమ్మానికడ్డంగా తొంగున్నావు. నేనేటి సేసేది? ముందు నువ్వు నెగిసి బైటికిరా.''

మున్సిపాల్టీ వాళ్లు ముందు రోజు సాయంకాలం వచ్చి అందరి పేర్లూ రాసుకు వెళ్లారు. సారంగధరుడి మెట్ట దగ్గర, క్వారీల పక్క అందరికీ గుడిసెలేసుకోడానికి స్థలాలిస్తారట. పుష్కరాలకు ఊరిని అందంగా కన్పించేలా చెయ్యాలని మున్సిపాల్టీవారి తాపత్రయం. పట్నం ఒంటి మీది 'గాయాల్లాం'టి మురికి గుంటల్ని ఓ పక్క తాత్కాలికంగా పూడ్చుకొస్తు న్నారు. ఆ పైన 'కురుపుల్లాంటి' ఆక్రమిత పూరి గుడిసెల్ని (ఈపైత్యం రచ యితది కాదు పత్రికా విలేకరులది) సమూలంగా పెకలించెయ్యదల్చుకు న్నారు. అలా పెకలించేసేక ఓ చోటంటూ చూపించకపోతే అణిచేసిన సెగగ డ్డల్లాగ మరోచోట అవి తెల్లారేసరికి ప్రత్యక్షమై పోతాయని వారికి అనుభ వపూర్వకంగా తెలీడం వలన ప్రత్యామ్నాయంగా ఊరికి దూరంగా గుట్టల మధ్య ఒక్కొక్క కుటుంబానికీ నాలుగడుగుల స్థలాన్ని కేటా యించారు. 'మనిషి చస్తేనే ఆరడుగుల నేల కావాలే, నాలుగడుగుల జాగాలో గుంపులు గుంపులుగా పిల్లాజెల్లల్తో ఎలాగ బ్రతకాలా నా కొ..రా' అని ఎవరూ అడగలేదు. అడగరు, ఎందుకంటే పేరుకి ఓ గుడిసెంటూ వుంటుందే కాని, వాళ్లల్లో ఎవరూ రోజంతా గుడిసెలో వున్న పాపాన పోరు. ఆడామగా అంతా కూలీ నాలీ చేసుకోడానికి పోతూ ముసలాళ్లనీ, అంగవై కల్యం ఉన్న వాళ్లనీ, అయిదేళ్లు దాటని పసివాళ్లనీ ఖాళీ డబ్బాలిచ్చి రైల్వే స్టేషన్లోనో, ఏ గుడి ముంగిటో, ఏ మసీదు వాకిట్లోనో కూర్చోబెట్టిపోతారు. రాత్రికంతా గుడిసె దగ్గరికి వస్తూ వస్తూ తమ సంపాదనలోంచి దార్లో దొరి కిందేదో కొనుక్కు తినేసి కడుపు నింపుకుంటారు. ఏ చేపల పులుసు తినాల నిపించినప్పుడో తప్ప అక్కడి పొయ్యిలు రాజుకోవు.

వయసులో ఉన్న పెళ్లికాని మగ కుర్రాళ్లు ఏ ప్లాట్‌ఫారం మీదో తెల్లారే దాకా ఓ కునుకు తీసేస్తారు. తోడున్న జంటలు మాత్రం కాళ్లు లోపలికి తీసు కుంటే తలలూ, తలలు ముడుచుకుంటే కాళ్లూ బైటికొచ్చే ఆ గుడిసెల్లో ముడుచుకుపోయి కాపురాలు చేసేస్తుంటారు. తలుపూ ద్వారంలేని ఆ





గుడిసెల్లోంచి తమ కదకలికలు అందరికీ బట్టబయలేనన్న విషయం తెలిసి కూడా ఏ దుప్పటి ముసుగులోనో బహిరంగంగా రహస్యాన్ని కాపాడుకుంటూ ఉంటారు.

ప్రస్తుతం అక్కడి వాళ్లంతా కొత్తచోటికి చేరబోయే ఉత్సాహంలో ఉన్నారు. ఇప్పుడెళ్లబోయే స్థలాన్ని గవుర్మెంటు తమకి నికరంగా పట్టాలు రాసిచ్చేస్తాదని రాత్రే కథలు కథలుగా చెప్పేసుకున్నారు. అంత దూరం నడవలేని ముసలాళ్లు మాత్రం ''మీకేం పిచ్చేటల్లా, మనవేం ఆళ్ల సుట్టాలవా బందుగులవా మనకాడ ఒక్క పైసా పుచ్చుకోకుండా ఉత్తినే మనకి తలాలు రాసిచ్చెయ్యటానికి? అదీ గాకుండా పుష్కరాల్లో గోదారమ్మకీ, ఊరికి దూరంగా పోయి మనం చేసేదేంటంట? నాలుగు డబ్బులొచ్చి ఏళకి ఇయ్యేం పొయ్యికాలం బుద్ధులొచ్చేయిరా మీకు? ఆళ్లిచ్చే తలాల్ని నెత్తినెట్టుకు పోతారేటి ఎవులైనా? అయినా మనకి ఏ రోజుకారోజు పొట్టల్లోకి కూడుండాలగానీ, ఇల్లూ వాకిళ్లూ మనమేం చేసుకుంటాం, ఇయ్యాలిక్కడుంటాం, రేపెక్కడుంటావో ఆ పరమాత్ముడికే ఎరిక. అందుకని ఆళ్లు సూపిచ్చే మోసేతి మీద తేనె సుక్కని నమ్ముకుని అరిచేతిలోది అవతల పారేసుకోకండి. టేసనుకి ఈ పక్క నించి పొమ్మంటే ఆ పక్కకెల్లి గుడిసేసుకోవాల. ఆ పక్కనించి పొమ్మంటే మళ్లీ ఈ పక్కకొచ్చెయ్యాల'' అని హితవులు చెప్పేరు.

గేటుకి చేరబడి బీడీ కాల్చుకుంటున్న స్వీపరు ఏసోబు మాత్రం బీడీ ముక్కని తుపుక్కున ఉమ్మేసి ''ఓరి ఎదవల్లారా! రాజమండ్రీకి ఇదేవన్నా ఉత్తుత్తి సోకనుకుంతన్నారేటి, పుష్కరాల సోకు. కళ్లు జిగేల్మనిపోవాలని మునిసిపాలాఫీసులో అయ్యగార్లు సెప్పుకుంతంటే ఇన్నాను. ఇంకంతే, మీకు గోని సంచులూ గుడ్డముక్కలూ కూడా దక్కవు. నా మాటినుకోని మంచిగా ఎలిపోండి. పుస్కరాలైపోయిన మర్నాటికెలాగా మీరిక్కడికి రాకా తప్పదు, ఆ బాబులందరూ సూసీ సూణ్ణట్టూరుకోకా తప్పదు'' అన్నాడు.

ఆ మాటలకి అందరూ కట్టుబడిపోయేరు.

మురిక్కాలవల్ని జల్లెడ పట్టే మాలచ్చి మాత్రం ఏ వెరగనట్టు ఏసోబు పక్కకెళ్లి నుంచొని బొడ్లోనించి మడతలు పడి మాసిపోయిన రూపాయి కాయితం ఒకదాన్ని తీసి వాడి చెయ్యందుకుని రహస్యంగా వాడి గుప్పిట్లో కుక్కింది. 'ఓరేసోబూ, నా కొడకా! పుస్కరాలెల్లిన మర్నాడు తెల్లారీసరికల్లా నేనూ, నా కుర్రోళ్ళూ ఇక్కడుంటాం. ఈసోటు మాత్రం ఎవురూ ఆక్కరమించెయ్యకుండా సూసిపెట్టు నాయన్నాయనా! సచ్చి నీ కడుపునుడతాను'' అని బతిమాలింది.

ఏసోబు కదరదని కొంచెంసేపు బెట్టు చేసి, మరో రూపాయి చిల్లరడబ్బులుచ్చుకుని 'సరే'నని అభయమిచ్చేడు.

బోడెమ్మ కాళ్లు ముందుకు జరుపుతూ గుడిసెలోంచి బైటపడింది. ఇంకా నిద్రలో ఉన్న నలుగురు పిల్లల్నీ నాలుగంటించి లేపి కూర్చోబెట్టింది. బోడెమ్మ బైటికొచ్చిన కంతలోంచి గంగ లోపలికి దూరింది. ఒకపాత కోక పరిచి వున్న నాలుగు గిన్నెలూ చట్టిలూ సర్దడం మొదలుపెట్టింది. ఈ లోపల బోడెమ్మ గుడిసెపైన వేసిన గోనెముక్కలు రెండూ లాగి పక్కన పడేసి, మూడువేపులా నిలబెట్టిన తడిక ముక్కల్ని జాగ్రత్తగా పెకిలించమని పిల్లలకి పురమాయించింది. పిల్లలు ఆ తడకల్ని గుంజడం మొదలు పెట్టారు. అదిగో అక్కడే అనుకోకుండా గొడవ మొదలైంది.

తడికకి చేరబెట్టిన గాజుపళ్ళెం తడిక గుంజడంతో ముందుకి పడిపోయింది. పడీ పడ్డమే అంచుమీద అంగుళం మేర పగులిచ్చింది. ఆ గాజుపళ్లెం గంగకి ప్రాణం. తన పుట్టింటి నుంచి తెచ్చుకున్న ఏకైక సామగ్రి అదే. దాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తోంది. ఆ పళ్లానికి అంచు పగిలిపోగానే గంగకి గుండెలో ఎవరో కత్తి దింపినట్లైంది.

ఉక్రోషం పట్టలేక తడక గుంజుతున్న పేరిగాణ్ణి పట్టుకుని వీపుమీద ఛెళ్ళుమని ఒక్కటేసింది. అది చూసి బోడెమ్మకి ఉడుకెత్తిపోయింది.

''ఓసి నీ సేతులడిపోనూ, రంకు నా సైతీ! నీకేం పొయ్యికాలవొచ్చిందే, అణ్ణంత దెబ్బ కొట్టీసేవు'' అంది కాళికావతారం ఎత్తేసి.

''కొడతానా సంపేత్తానా ఎదవని. సచ్చినోడు నా గాజుపళ్లేన్ని..''

గంగని మాట పూర్తిచెయ్యనీకుండా బోడెమ్మ అందుకుంది. ''ఓలబ్బో గాజు పర్రెం. అమ్మగారింటికాణ్ణుంచి అట్టుకొచ్చేసింది అరణం. నాకు మండుకొచ్చిందంటే నేలకేసి కొట్టీసి నాలుగు సెక్కలు సేసీగల్ను జాగర్త'' గాజు పళ్లాన్ని గంగమీదికి విసిరేసింది బోడెమ్మ.

''ఏదీ, సెయ్ నంజా, నాలుక్కాదు రెండు ముక్కలు సెయ్ సూదాం. నీ బుర్ర కూడా రొండు సెక్కలైపోద్ది దెబ్బకి'' ఆ పక్కనే పడున్న కట్టె పేడునో దాన్ని చేతిలోకి తీసుకుంది గంగ.

గంగ చేతిలో కట్టెపేడు చూడగానే బోడెమ్మ వీధిగిరిపోయేటట్లు రాగం లంకించుకుంది. ''ఓలమ్మోలమ్మో! ఈ దొంగలం..ఈ దొమ్మరిసాని, నా మొగుణ్ణి వల్లో ఏసుకుని నా కాపరంలో నిప్పులేసింది, నా మొగుణ్ణి పొట్టనెట్టేసుకుంది గాకుండా ఇంక నన్ను సంపెయ్యడానికి తయారైందిరో బాబో'' కూర్చుని నెత్తిన రెండు చేతులూ పెట్టుకుని రాగాలీసి రాగాలీసి మొగుణ్ణి తల్చుకుని ఏడుపు మొదలు పెట్టింది. అది చూసి బిత్తరపోయిన గంగ కట్టెని కింద పడేసింది.

కట్టైనైతే పడేసింది కానీ, పొంగుకొస్తున్న ఉక్రోషాన్ని అపుకోలేకపోయింది.

''పోపోయే రోగిష్టి నంజా! నువ్వు పనికిరాని డొక్కునంజవనే కదా ఆడు నన్ను తెచ్చుకున్నాడు'' అంది బోడెమ్మని ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టేనని మురిసిపోతూ. ఆమె మురిపెం ఎంతోసేపు నిలవలేదు. బోడెమ్మ దెబ్బతిన్న పులిలాగ క్షణంలో ఎగిరి దూకి గంగ జుట్టు పట్టేసుకుంది. ఆ జుట్టుని చేతికి మెలిపెట్టుకుని వంచి, వీపుమీద గుభీ గుభీమని గుద్దింది. ఆమె కెంతసేపూ రెండు చేతులూ అడ్డం పెట్టుకుని తన గర్భం మీద దెబ్బ పడకుండా కాపాడుకోడానికే సరిపోయింది. కొట్టి కొట్టి బోడెమ్మా, దెబ్బలు తిని తిని గంగా సొమ్మసిల్లిపోయేరు.

తెల్లారి ఆరుగంటల వేళకంతా అందరూ మూటల్తో సిద్ధమైపోయేరు.

ఎలాగో ఓపిక చేసుకుని గంగ కూడా తన గుడ్డల్లో గాజుపళ్లెం జాగ్రత్తగా పెట్టి మూటకట్టుకుంది.

ఆనెం కళాకేంద్రం గోడ పొడవునా గుడిసెలు పీకేసిన ఆనవాలు తప్ప మరేం మిగల్లేదు.

కేన్‌తో టీ అమ్ముకునే కుర్రాడొస్తే అందరూ టీ నీళ్లు కడుపులో పోసుకున్నారు. తనూ టీ తాగుదామని గంగ మొల్లో వెతుక్కుంటే బొడ్లో దోపుకున్న అర్ధరూపాయి బిళ్ల కనపళ్లేదు. చెట్టు వెనక్కెళ్లి గబగబా చీర కుచ్చిళ్ళన్నీ పీకేసి చూసుకుంది. ఊహూ. ఇందాకిటి కొట్లాటలో ఎక్కడో పడిపోయినట్టుంది. ఆశ చావక చాలాసేపు వెతుక్కుంది గంగ. దొరకలేదు. పోనీ ఎవరైనా 'ఈ టీ నీల్లు తాగు' అంటారేమోనని చూసింది. ఎవరూ అనలేదు. టీ కుర్రోడు

కవిత

కాలం



కారణమేదైనా
కాలంతో రాజీ
పడాల్సిందే!
ఎదురు తిరిగిన వారు లేరు!
నిలిచి గెలిచిన వారూ లేరు!
కరుగుతూ మరుగుతూ
బతుకులు లాగాల్సిందే!
తెగిన దారాల్ని
ముడిపెట్టాల్సిందే!
కొడిగట్టిన దీపాల్ని
తడి చేసి పెంచాల్సిందే!
పోయిందేది రాదు
వచ్చిందేది ఉండదు
చిగురిస్తే సంతోషం
ముదిరితే ముదం
మరి రాలితే..
ఎందుకీ.. వ్యధ!
కాలాన్ని శాసించేదొక రైతే!
మనల్ని శాసించేది.. కాలమే!

-షేక్ మస్తాన్ వలి

9440712591

అరువివ్వనన్నాడు. ''ఇక్కణ్ణించి ఎల్లిపోతన్నారు కదా'' అన్నాడు. ఆ మాట విని బోడెమ్మ గయ్యి మని లేచింది మళ్లీ.

''అదెక్కడి కొత్తాది నా సవితి? దానికెవుడూ బొట్టెట్టి బూములియ్యలేదు. నా మొగుడికి నేను నీతైన పెళ్లాన్ని కాబట్టి గవుర్మెంటోడు నాకూ, నా బిడ్లకీ ఇచ్చేడు. ఇలాంటి అడ్డవైన గుంట ముండ లకీ ఇచ్చెయ్యటానికి ఆడేం తెలివిలేనోడు కాడు''

''నీ టీ నీల్లు తాగాపోతే నేనేం సచ్చిపోన్లే, ఎల్లెల్లు'' అని అనవసరంగా టీ కుర్రాణ్ణి కసుకురు కుని అటు తిరిగి కూర్చుంది గంగ.

ఏడుగంటలకంతా మున్సిపాల్టీ వాళ్ల మని షొచ్చి అందరూ ఎక్కడికెళ్లాలో చెప్పేసి పోయాడు. వరసగా పేర్లు చదివేటప్పుడు ఆ లిస్టులో బోడెమ్మ పేరుంది గాని, గంగ పేరు లేదు.

నాలుగైదు రోజులక్రితం అందరూ పేరిస్తా ఉంటే బోడెమ్మా, పిల్లలు ఎక్కడుంటే తనూ అక్కడే కదా అనే ధీమాతో గంగ తన పేరివ్వ లేదు.

'ఆ, ఇయ్యన్నీ మామూలే, ఇలాంటి గొడవలు ఎన్నిసార్లు జరగలేదు! ఈ బోడిదానికసలే ఒళ్లొం గదు. నేను లేకపోతే దీనికి తిండి పెట్టేవోళ్లెవరు?' అనుకుంది ధీమాగా.

నెల రోజుల క్రితం అతిసారం వచ్చి రాజయ్య పోయినప్పట్నుంచీ గంగే ఆ కుటుంబానికి మొగదిక్కులా నిలబడింది. నలుగురు పిల్లల్ని వెంటేసుకుని బజార్లోకి పోయి పచారీ దుకాణాలకి మూటలూ, గంపలూ మోసి రోజుకి అయిదార్రూపాయలు సంపాదించుకొస్తోంది. నూకలు కొనుక్కొచ్చి, ఏ వేళైనా పొయ్యి రాజేసి గంగ వండి పొయ్యాల్సిందే, బోడెమ్మ మాత్రం ముణ గదీసుకు పడుకుని కదలదు. ఇక్కడి పూచికపుల్ల తీసి అక్కడ పెట్టదు. 'ఏవంటే' రోగం అంటుంది. 'వేళకి లేచి గిన్నెడన్నం మొప్పొద్దులా తినేదానికి ఏం మాయరోగవో' అనుకుంటుంది గంగ. బెట్టు చేస్తూ అటు తిరిగి కూర్చున్న గంగనొదిలేసి వెళ్లిపోయేరంతా. ఆశ చావని గంగ వాళ్లు కనుమరు గయ్యే వరకూ చూస్తూనే ఉంది. తను పెంచిన ఆఖరోడైనా వెనక్కొచ్చి ''చిన్నమ్మా, నువ్ రాయే'' అంటాడేమోనని. అలా జరగలేదు. అప్పుడు పొంగుకొచ్చేయి గంగకి గోదావరన్ని కన్నీళ్లు. ఒక్కసారిగా ఆకాశంలో మబ్బులు కమ్ముకొచ్చేయి. సన్నగా చినుకులు ప్రారంభమయ్యేయి.

భారంగా లేచి, మూట చంకనేసుకుని ఒక్క నిమిషం ఆలోచించింది గంగ అటు స్టేషన్లోకి పోదామా, ఇటు కళాకేంద్రం ఆవరణలోకి పోదామా అని. తను నుంచున్న గోడ వెనుకే వున్న కళా కేంద్రమే దగ్గరగా తోచింది. అదీగాక స్టేషన్లో గన్నిగాడి పోరొకటి.

చుట్టు తిరిగి గేట్లోంచి తిరిగొచ్చి కళాకేంద్రం మెట్లన్నీ ఎక్కేసరికి అలుపొ చ్చింది గంగకి. ఆయాస పడుతూ స్తంభానికి చేరబడి కూర్చుండిపోయింది. మొట్టమొదటి సారి రాజమండ్రి రావడం గుర్తుకొచ్చింది.

చిల్లు గిన్నెలకి మాట్లెయ్యడానికి తమ ఊరొచ్చిన నలభై ఏళ్ల రాజియ్య నెల్లాళ్లపాటు తమ గుడిసెలోనే ఉన్నాడు. చుట్టూ అడవి, కొండలూ. రోజూ కొంత కొండ మేరకి కొండల్ని పగలగొడుతూ రాళ్లు కొట్టే జనం. ఆ గుడిసెల్లో వుండే జనాలకి కాస్త గంజి కాచుకుని తాగడం, మళ్లీ రాళ్లు కొట్టే పన్లో మునిగి పోవడం తప్ప మరో వ్యాపకం ఉండేది కాదు.

ఊహ తెలిసినప్పట్నుంచీ అదే ప్రపంచంగా పదహారు ఏళ్లు ఒంటిమీదకి తెచ్చుకున్న గంగకి రాత్రి తన తండ్రితో బాటు కల్లు ముంత ఖాళీ చేసి చిల వలు పలవలుగా రాజియ్య చెప్పే రాజమండ్రి కబుర్లు కడుపు నింపేసేవి.

గోదావరి ఒడ్డునే గుళ్లు, గోపురాలూ, గోదావరి మీద బ్రిడ్జీలూ, కడతా కడతా వున్న మూడో బ్రిడ్జి స్తంభాలూ, సినిమా హాళ్లూ, కాపీ ఒటేల్లు ఒకటేంటి రాజమండ్రి అంటే స్వర్గం అనిపించేది గంగకి. నెల గడిచే సరికి కల్లు ముంతల స్నేహం ముదిరి, పదహా రేళ్ల గంగని తనకి కట్టబెట్టమని రాజియ్య అడిగిన వెంటనే తల ఊపేసాడు గంగ తండ్రి. గంగ తల్లి గంగని చాటుకి పిల్చి చివాట్లేసింది. ''ఆడి వయ సెక్కడ, నీ వయసెక్కడ? నీ బాబంత వయసో డాడు. ఆణ్ణి కట్టుకుని నువ్వేం సుకపడతావే పిచ్చిమొకవా, ఆణ్ణి సేసుకోనని సెప్పు''

కాని, గంగకి తల్లి మాటలు చెవికెక్కలేదు. ముందార్లాళ్ల ప్రపంచం నించి బైటపడితే చాలను కుంది. ఆ ఛాన్సు వదిలేసుకుంటే అక్కడే రాళ్లు కొట్టే ఏ కుర్రాడికో తనని కట్టబెట్టేస్తారు. మరో ప్రపంచం అనేది చూడకుండానే ఈ రాళ్ల మధ్యనే తన బతుకు వెళ్లమారిపోతాది.రాజియ్య చేత మెళ్ళో పసుపుకొమ్ము కట్టించుకుని ఆడి వెంట వచ్చేసింది. కాణీ కట్నం అడగలేదు సరికదా, అత్తగారికో జనతా చీర, మావగారికో జనతా పంచె కొనిపెట్టిన రాజియ్య దేవుళ్లాగా కనిపిం చేడు వాళ్లకి. ఆ రాత్రి కల్లుముంతల పార్టీ చేసాక అక్కడున్నోళ్లందరికీ దేవుళ్లాగే కనిపించేడు. పుట్టింటి వాళ్లు గంగకి ఒక కొత్త కోకైనా కొనలేకపోయేరు.

రాళ్లు కొట్టిన డబ్బులు దాచుకుని అటుగా వచ్చిన కావిడి సామాన్ల వాడి దగ్గర చిన్నప్పుడెప్పుడో ముచ్చటపడి కొనుక్కున్న, బాతులూ, లతలూ ముద్రించి ఉన్న అన్నం కంచమంత గాజుపళ్లాన్ని మాత్రం గంగ పదిలంగా తనవెంట తెచ్చుకుంది. మొదటి సారిగా రైలు బండెక్కించిన రాజియ్య గంగ కళ్లకి ఆడు చెప్పిన సినిమా కథల్లోని హీరోలా కన్పించేడు.

ఇప్పట్లాగే ఆ రోజు సన్నటి చినుకులు పడుతున్నాయ్. గోదావరి స్టేషన్లో దిగి ఏదో ప్రపంచంలో తేలిపోతూ గాలిలో నడిచొచ్చిన గంగకి నేలమీద బోర్లా పడిపోడానికి ఎంతోసేపు పట్టలేదు.

గుడిసె గుమ్మం దగ్గరే ఎంగిలి గిన్నెలు కడుక్కుంటున్న బోడెమ్మ రాజి య్యని చూస్తూనే తిట్లకి లంకించుకుంది. ''ఇన్నాళ్లూ ఎక్కడికి పోయా? ఎదవ సచ్చినోడా, ఇక్కడ తిండీ నీళ్లూ లేకుండా మేం సచ్చినా నీకేం ఫరవా లేదన్న మాట!'' అంటూ.

''ఇదెవత్తీ నీ ఎనకాల? మెళ్లో కొత్త పసుపుతాడుంది. అమ్మో అమ్మో, నా గొంతుక్కోసేసేడల్లో. ఈ ఆడంగిరేకు లెదవ ఇంకెవత్తో రంగసాన్ని ఎంటబె ట్టుకొచ్చీసేడల్లో'' అంటూ గుడిసె లెగిరిపోయేటట్టు రాగాలెట్టింది. ''ఆడికి సిగ్గులేకపోతే నీకూ నేదంటే? ఆడి వయసెక్కడ, నీ వయసెక్కడ?'' అంటూ గంగని బుగ్గల్లో పొడిచింది. అప్పుడర్థమైంది గంగకి రాజియ్యకిది వరకే పెళ్లాం పిల్లలూ ఉన్నారనీ, రాజియ్య హీరో కాదనీ, పెళ్లాం ముందు పిల్లి అనీ. ఏం చెయ్యాలో తోచని గంగ కొంగు బొడ్లో దోపుకుని బోడెమ్మ చేతిలోని ఎంగిలి గిన్నెలందుకుంది. కాస్సేపట్లోనే గుడిసెంతా అలికి ముగ్గేసి అద్దంలా తయారు చేసింది. సాయంకాలం పెద్ద పిల్లలు ముగ్గురికీ స్టేషను కుళాయి దగ్గిర రుద్ది రుద్ది స్నానాలు చేయించింది. చిరుగుల లాగూలకి కుట్లు వేసి తొడిగింది. చంటోడికి తాటాకుల మంట మీద వేణ్ణీళ్లు మరిగించి పోసి, శుభ్ర మైన పాత గుడ్డల్లో పడుకోబెట్టింది. వంటంతా కానిచ్చి, అలిగి పడుకున్న బోడెమ్మకి పాదాలు ఒత్తింది.

ఇన్ని చేసినా, వారం రోజులకి గాని బోడెమ్మ కోపం చల్లారలేదు.

ఆ తర్వాత బోడెమ్మ మహారాణీ, గంగ దాసీ పిల్లా అయ్యారు.

రాజియ్యకి బోడెమ్మ ఎదుట నోరెత్తే ధైర్యమే కాదు, కన్నెత్తే ధైర్యం కూడా

అభిమానుల్ని సంపాదించిన కథ

నేను కథలు రాయడం మొదలు పెట్టిన కొత్తల్లో రాసిందీ గాజుపళ్లెం కథ. ఈ కథలోని గంగ నాకు చిన్న ప్పటి నుంచీ తెలుసు. మా వీధి చివర ఒక పూరిగుడిసెలో వుండేది. ఒకసారి రాజమండ్రి లోని ఆనెం కళాకేంద్రంలో ఏదో కార్యక్రమానికి అటెండై తిరిగి వస్తూంటే ఆ గోడ పక్కనే ఉన్న గుడి సెల్లో కనిపించింది. పలకరిస్తే తన కష్టసుఖాలన్నీ వెళ్లబోసుకుంది. ఈ కథ ఎవరికీ నచ్చదేమో అనే సంశయంతో చాన్నాళ్లు ఏ పత్రికకూ పంపలేదు. సంశయిస్తూనే 'రంజని' పోటీకి పంపించేను. అవార్డు పొందింది, అభిమానుల్ని సంపాదించి పెట్టిన మొదటి కథ ఇది. అందుకే ఇది నాకు ఇష్టమైన కథ.

-కె.వరలక్ష్మి

లేదు.

ఎప్పుడైనా బోడెమ్మ ఏ సినిమా కెళ్లినప్పుడో తప్ప రాజియ్య గంగని తాకే వాడు కూడా కాదు. ఒకట్రెండుసార్లు గోదావరతల ఊళ్లకి మాట్లెయ్యడానికి వెళ్తా వండి పెట్టడానికి గంగని తన కూడా పంపమని రాజియ్య బోడెమ్మని అడిగేడు. ఒంటికాలి మీద లేచిన బోడెమ్మ నోటికి ఝడిసి ఆ తర్వాత ఆ ఊసెత్తడం మానేసేడు.

గంగకి మాత్రం ఆ చుట్టుగుడిసె స్వర్గంగానూ, గోదారి నీళ్లు అమృతం గానూ అన్పించేవి. పనంతా చేసేసి, బజార్లో రెండ్రూపాయలు చేతిలో పడ గానే మేట్నీ సినిమాకెళ్లిపోయేది. చిరంజీవి ఆమె కలల రాకుమారుడు. కళా కేంద్రంలో తరచుగా జరిగే కార్యక్రమాల్లో ఏ నాట్యమో, నాటకమో వుంటే సీనారేకు డబ్బా మీదికెక్కి గోడమీది నుంచి, బోడమ్మ తిట్టేవరకూ చూస్తూనే ఉండేది. గంగకి బతుకులో కష్టం అనే పదానికర్థం తెలీదు. ఆమె కళ్లకీలోకం ఎప్పుడూ రంగుల్లోనే కన్పిస్తూ ఉండేది.

రాజియ్య వెంట వచ్చిన నాలుగేళ్లకి నెల తప్పిందని తెల్సినపుడు సంతో షించిన వాళ్లెవ్వరూ లేకపోయారు. చిత్రంగా గంగకి ఇన్నాళ్లకి తల్లి గుర్తుకొ చ్చింది. ఏమైనా సరే తల్లి కాబోయే వేళకి తన తల్లి దగ్గరుండాలని అను కుంది. ఆ మాటే రాజియ్యతో అంటే, ''నీకేమైనా పిచ్చేటే, అంత దూరవెల్లా లంటే సార్జీలకి ఎంతుండాలో తెస్సా?'' అన్నాడు. ''ఆ అడవిలో ఏటుం టాది? ఇక్కడే మంచి ఆడ డాకటేరు కాడ పురుడు పోయిత్తాను''

అది జరిగే పని కాదని గంగకెప్పుడో అర్థమైంది. రాజియ్య సంపాదించిన కొద్దో గొప్పో తాగుడుకే ఖర్చైపోతోంది. గంగ రెక్కలు ముక్కలు చేసుకుని ఆ కుటుంబాన్ని పోషించాల్సి వస్తోంది. వేణ్ణీళ్లకి చన్నీళ్లుగా ఉంటాయని ముక్కుపచ్చలారని కుర్రాళ్లకి కూడా పావలో అర్థో సంపాదించడం నేర్పింది. గంగకి ఏడో నెల వచ్చేక రాజియ్య అర్థాంతరంగా కన్ను మూసేడు. అప్పుడు కూడా గంగ బెంబేలెత్తిపోలేదు. చుట్టూ మనుషులుంటే చాలు, ఆమె రెక్కలే ఆమెకి ధైర్యం. బోడమ్మకీ, పిల్లలకీ గంగే ధైర్యం చెప్పింది. ఆ గుడిసెల్లోని నలుగురూ శవాన్ని మోసుకుపోయేక పది గుడిసెల్లోంచీ పది గుప్పిళ్ల బియ్యం అడిగి తెచ్చి, అన్నం వండి ఆ తల్లీ పిల్లల చేత తినిపించింది.

అలాంటి గంగకీ రోజు ఈ ఒంటరితనం బెంబేలెత్తిస్తోంది. నాలుగేళ్లనించి ఇక్కడే బతికినా, ఊరేంటో పరాయిదిగా అన్పిస్తోంది. తెలిసున్న ముఖం ఒక్కటీ లేనట్టు అన్పిస్తోంది.

క్రమంగా చినుకులు పెద్దవై వాన జోరందుకుంది.

కళాకేంద్రం ముందు వెంకటేశ్వరాలయం కడుతున్న కూలీలంతా వరం డాలలోకి పరుగెత్తుకొచ్చి పడ్డారు. అలా మొదలైన వాన సాయంకాలం వరకూ ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది.

వాళ్లందర్నీ చూస్తే గంగకి ఏదో ఆశ కలిగింది. మేస్త్రీ దగ్గరకెళ్లి రేపట్నుంచి తనకి కూడా పని ఇప్పించమని అడిగింది.

మేస్త్రీ ఆమెని ఎగాదిగా చూసి ''నువ్వు చేసే పని కాదులే ఇది, ఎల్లెల్లు'' అన్నాడు. ''అయినా పొద్దున్న రేడియోలో సెప్పేరు, ఈ వాన ఇప్పుడప్పుడే తెరిపియ్యదంట''

ఆ వానలో తడుస్తూనే క్రమంగా అందరూ వెళ్లిపోయేరు. గంగ మళ్లీ ఒంటరిగా మిగిలిపోయింది.

నిన్న బజార్లోనూ ఇదే వరస. తను బరువులు మొయ్యలేకపోతూందని, త్వరగా నడవలేక పోతూందని షావుకారు కేకలు పెట్టాడు. ''మా ప్రేణం తియ్యకపోతే ఆ బరువేదో దింపుకున్నాక రారాదూ'' అన్నాడు తన కడుపు కేసి చూస్తూ.

''ఆ సచ్చినోడలా వాగితే మాత్రం నాకిది బరువెలా అవుతాది? నా బిడ్డ, నా రగతంలో రగతం, ఇక మీద ఈడే కదా నాకు తోడూ నీడా'' అనుకుంది ఆప్యాయంగా కడుపు వేపు చూసుకుంటూ. ''ఆడికి అన్నం తినే వయసొచ్చేక గాజుపల్లెంలోనే అన్నం తినిపించాలి'' అనుకుంది గర్వంగా. అందర్లాగా ఆడు సత్తుగిన్నెల్లో తినడు.

టైమెంతైందో గాని మబ్బులు దట్టంగా మూసేసి పొద్దు గూకినట్టే ఉంది. కడుపులో కదిలి కదిలి ఇక ఓపిక లేనట్టు ఆగిపోయింది బిడ్డ. పొత్తి కడుపు బిగబట్టుకుపోయి నట్టుంది. ఆకలికి శోషొచ్చినట్టైపోతోంది. గంగని తన కడు పులో ఆకలికన్నా, బిడ్డ కడుపులో ఆకలి ఎక్కువ బాధిస్తోంది. ఏ వేడి గంజో పోసి బిడ్డని లేపాలి. కడుపులో బిడ్డ కదలకపోతే ప్రమాదం అని బుచ్చిది





నయనతార, అసిన్‌లను వద్దన్న కండల వీరుడు....

ఇద్దరు అందమైన అమ్మాయిలు వెంటపడుతుంటే కాదనే అబ్బాయిలు తక్కువ మందే ఉంటారు. నిజజీవితంలో అయితే కచ్చితంగా కండల వీరుడు అదే మన సల్మాన్‌ఖాన్ ఆ ఇద్దరు అందగత్తెలకు ఓకే చెప్పేవా డేమో కానీ.... సినిమా కావడంతో ఆ ఇద్దరికీ 'నో' చెప్పేశాడు. ఇంతకీ అసలు విషయం ఏమిటంటే....

సల్మాన్‌ఖాన్ తదుపరి సినిమాలో నటించడానికి నయనతార, అసిన్ ఇద్దరూ వీర లెవల్లో పోటీ పడ్డారు. నయనతార బాలీవుడ్‌కి కొత్త కాబట్టి, ఎప్పుడూ 'కొత్తదనాన్ని' కోరుకునే సల్మాన్‌ఖాన్ ఆమెనే సెలక్ట్ చేసుకుంటా డని కొందరు, కాదు కాదు....అసిన్ అంటే ఏమిటో... ఆమె నటన ఏ పాటిదో సల్మాన్‌కు బాగా తెలుసు కాబట్టి ఆమెను తన పక్కన హీరోయిన్ చేస్తాడని మరికొందరూ వాదులాడుకోవడం తెలిసిందే! ఈ ఇద్దరు ముద్దు గుమ్మల మధ్య ఎందుకు నలిగిపోవాలనుకున్నాడో ఏమో....వీరిద్దరిని కాదని సల్మాన్ దీపికా పదుకొనేకే తన ఓటు అనేశాడు. సల్మాన్ మీద బోలెడన్ని ఆశలు పెట్టుకున్న ఆ ఇద్దరు ముద్దుగుమ్మలు చివరికి కామ్ అయిపోవాల్సి వచ్చింది. 'లండన్ డ్రీమ్స్' ఫ్లాప్‌కి మిగతా వారికన్నా అసిన్ బాధ్యతే ఎక్కువగా ఉందని సల్మాన్ ఫీలయ్యాడని పరిశ్రమలో పలువురు గుసుగుసలాడుకొంటున్నారు. ఇకపోతే నయనతార విషయాని కొస్తే.... టాలీవుడ్, కోలీవుడ్‌లలో ఎక్కడా ఛాన్సులు లేకే బాలీవుడ్ వైపు దృష్టి సారిస్తోందన్న విషయం సల్మాన్‌ఖాన్‌కి తెలియడంతో ఆ 'ఐరన్ లెగ్'తో తలగోక్కోవడం ఎందుకు? అన్న ఉద్దేశంతో నయనతార విష యంలో పక్కకి జరిగాడని మరికొందరు అంటున్నారు. ఎవరి మాటలు ఎలా ఉన్నా, పాపం ఆ ఇద్దరి ముద్దుగుమ్మల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది అనడానికి ఇంతకంటే గొప్ప నిదర్శనం ఏం కావాలి?

చెప్పిన మాట గుర్తుకొచ్చి వణికిపోయింది.

ఎవర్నైనా అడిగితే గుప్పెడన్నం పెడతారేమో అన్పించింది. కాని, దరిదాపుల్లో ఎక్కడా ఇళ్లే లేవు.

పగలంతా పడుకున్న అప్సరాలాడ్జి గదులు రాత్రికి లైట్లతో సింగారించుకుంటున్నాయి. ఆ పక్క హోటల్లోంచి వస్తున్న కమ్మని పోపుల పరిమళానికి గంగకి నోట్లో నీళ్లూరి పోతున్నాయి.

ఇంకా పొద్దు గూకితే వాచ్‌మేన్ అక్కడుండనియ్యడని గంగకి తెలుసు. హోరున కురుస్తున్న ఆ వర్షంలో మూటని పదిలంగా గుండెకి హత్తుకుని మెట్లు దిగింది గంగ. కళాకేంద్రం ముందుండే తోపుడు బళ్ల దుకాణాల జాడే లేదు. ఎటు పోవాలో దిక్కుతోకచ తడుస్తూ గేటు ముందు ఆగిపోయింది. పాత పోలీస్‌క్వార్టర్స్ వైపు వెళ్లి కాస్త గంజి అడుక్కుందామని నిశ్చయించుకుంది. అగ్నిపూల చెట్ల కింది కొచ్చాక కాలు కదలక అలా నిలబడిపోయింది.

వీధుల్లో ఎక్కడా జనసంచారం లేదు. నిన్న ఈ సమయానికి అక్కడ జన నివాసాలుండేవి అంటే ఎవరూ నమ్మలేరు. అప్పుడే పశువుల సంత ముగిసినట్టుంది. ఆ ప్రాంతమంతా వదిలేసిన చింకి పాతలూ, పగిలిన కుండ పెంకులూ, పెంట పోగుల్తో వానకి తడిసి పరమ రొచ్చుగా ఉంది. గుడ్డి తాత ఇటిక పొయ్యి మాత్రం నదిలో సగం మునిగి ధ్యానంలో ఉన్న యోగిలా ఉంది.

గంగ మనసు మార్చుకుని కుడి పక్కకి తిరిగి స్టేషన్లోకి నడిచింది. అడుగు తీసి అడుగేస్తూంటే కుడి డొక్కలో కలుక్కుమంటోంది. అది ఆకలి నొప్పని ఆమెకి తెలుసు. పస్తులుండడం ఆమెకి కొత్తేమీ కాదు. కాని, ఈరోజు ఈ ఆకలి దుర్భరంగా ఉంది. బిడ్డ కదలని స్పృహ ఆమె గుండెని నొక్కేస్తోంది. కొత్తగా కట్టిన స్టేషను ఆవరణలోకి అడుగుపెడుతూనే ఒక నిర్ణయానికి వచ్చి, ఆమె కళ్లు గన్నిగాడి కోసం వెతికాయి. ఈ చివరి నుంచి ఆ చివరి దాకా కాళ్లీడ్చుకుంటూ తిరిగింది గంగ. 'ఒకవేళ అవతల ప్లాట్‌ఫాం మీదున్నాడేమో' అనుకుంది. బ్రిడ్జి ఎక్కి దిగే ధైర్యం చెయ్యలేకపోయింది.

ఏదో బండొస్తున్నట్టుంది. స్టేషన్లో అలజడి పెరిగింది.

ఆ జనం మధ్య పిచ్చిదాన్లా తిరుగుతోంది గంగ. మధ్య మధ్య క్రీనీడలో నిలబడి కడుపు తడివి చూసుకుంటోంది. ఊహు, బిడ్డలో చలనం లేదు. ఆమె అమ్మ మనసు తల్లడిల్లిపోతోంది. ఇంకా నేల మీద పడని, రూపం కూడా తెలీని బిడ్డకోసం ఆమె హృదయం ఒకటే కొట్టుకుంటోంది. ఇప్పుడింక వాణ్ణి బతికించుకోవడానికి ఏం చెయ్యడానికైనా సిద్ధమే.

టీ తాగే డబ్బులైనా దొరుకుతాయేమోనని ప్రయాణీకులు ఒకళ్లిద్దరు దగ్గిర చెయ్యి చాపబోయింది. అలవాటు లేని పని. ఆమె చెయ్యి వెనక్కి వచ్చేస్తోంది. బండొచ్చే తొందర్లో ఎవరూ గంగని పట్టించుకోవడం లేదు.

ఒకళ్లిద్దరు పోర్టర్లని గన్నిగాడి కోసం అడిగి చూసింది. పొద్దుపోయేక ఆణ్ణెవరూ చూళ్లేదన్నారు. అన్నోరంగాడైతే "ఏంటి సంగతి" అని కన్నుకొట్టి వెకిలిగా నవ్వేడు. దిక్కుతోచక గుడ్డ నీళ్లు కుక్కుకుంటూ క్రీనీడలో అలాగే చతికిల బడిపోయింది. వాన కొంత తెరిపిచ్చింది. 'తొమ్మిదో పదో అయ్యుంటాది' అనుకుంది గంగ. పాత బ్రిడ్జి మీంచి రోకలి బండలాగా పాక్కుంటూ వచ్చిన బండి కీచుమని గోలపెడుతూ స్టేషన్లో ఆగింది. ఆగిన బండిలోంచి రెండు సూట్ కేసులు నెత్తిన పెట్టుకుని దిగేడు గన్నిగాడు. 'ఇంటికెళ్లి కూడు తిని వస్తన్నాడన్నమాట' అనుకుంది. సత్తుకంచంలో తెల్లగా మల్లెపూలలాగా విచ్చుకున్న అన్నం కళ్లముందు కదిలింది గంగకి. ఆకలి రెట్టింపయింది.

బండెళ్లిపోయేక స్తిమితంగా గంగ కూచున్న చీకటి స్తంభం దగ్గరికొచ్చేడు గన్నిగాడు. "సందేల నించి నన్నడుగుతున్నావంట, ఏంటి సంగతి?" అన్నాడు కళ్లు చికిలించి చూస్తూ. వెలుగులో నిలబడి ఉన్న వాడి కళ్లు ఎర్రజీరల్తో చిరతపులి కళ్లలా మెరుస్తున్నాయి. వాడు తాగి ఉన్నాడని అర్థమైంది గంగకి.

"ఏటి, సెప్పవేటి" అన్నాడు వాడు విసుగ్గా. పొద్దున్న గంగ చూపిన ఛీత్కారపు చూపింకా మర్చిపోలేదు వాడు.

ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట్, హైదరాబాద్. 500 073.
ఫోన్స్ : 040-23747777 , 9391999999

FREE online Registration & Free search
www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com

అమీర్‌పేట్	నెల్లూరు
కూకట్‌పల్లి	తిరుపతి
దిల్‌షుఖ్‌నగర్	కర్నూలు
విజయవాడ	(చెన్నయ్) టి.నగర్
గుంటూరు	బెంగుళూర్
తెనాలి	సేలం
విశాఖపట్నం	మధురై
రాజమండ్రి	వెల్లూరు
కాకినాడ	తిరుచి
ఖమ్మం	పాండిచ్చేరి
ఒంగోలు	ఈరోడ్
	ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.

వీలైనంత అణకువని గొంతులోకి తెచ్చుకుని జాలిగా అంది గంగ – "ఏం లేదూ.. ఆకలి.. ఆకలేత్తా ఉంది. ఒక బన్నూ, కాసిన్ని టీ నీళ్ళూ కొనిపెడతావేమోనని.." గంగ పరిస్థితి అర్థమైంది గన్నిగాడికి. ఆకలెలాంటిదో వాడికి బాగా తెలుసు.

"సరే, కొనిపెడతాననుకో, నాకేటి లాబం?" అడిగేడు కసిగా.

గంగ ఒక్కనిమిషం మౌనంగా ఉంది. తర్వాత తెగించిన దానిలా అంది "నీకేం కావాలో తీసుకో.." ఆమె స్వరం కీచుగా జీరబోయింది.

"అవితే నాతోరా" ఎగిరి గంతేసినంత హుషారుగా అన్నాడు గన్నిగాడు.

లేచి వాడి వెనకే నడిచింది గంగ. ఇంకా తవ్వుతూ తవ్వుతూ ఉన్న అండర్ గ్రౌండు గుయ్యారంలోకి వాడు దారి తియ్యడం చూసి ఆగిపోయింది.

"ఉప్పుడు కాదు.. ముందు నాకు తిండి కావాల"

గన్నిగాడు వెనక్కి తిగిరి నోట్లో బీడీ తుపుక్కున ఉమ్మేసేడు.

"అదేం కుదర్దు. ముందు నా అవసరం తీరేకే నీ ఆకలి తీరతాది" నిర్ణయించుకో అన్నట్టు నిర్లక్ష్యంగా చూసేడు. వాడి గొంతులోని పట్టుదల అర్థమైంది గంగకి.

నిస్సహాయంగా కదిలింది. మోకాళ్ల లోతున్న వాన నీళ్లలోంచి చీకట్లోకి నడిచి నాలుగెళ్లుగా పెంచుకున్న కసితో ఒక్కసారిగా పులిలా మీదికి లంఘించిన గన్నిగాడి బరువుకి మొదలు నరికిన చెట్టులా వెల్లకిలా పడిపోయింది గంగ.

వెన్నులో ఫెటిల్లుమని ఏదో చిట్లినట్టైంది.

పదిలంగా గుండెలకి హత్తుకున్న గాజుపళ్లెం విరిగి వెయ్యి ముక్కలైంది. ❑

–ఆంధ్రజ్యోతి వారపత్రిక *28-2-1992*